

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | ఆదివారం | 27-09-2026 | సంపుటి: 3 | సంచిక: 234 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 27-09-2026 | VOLUME : 3 | ISSUE : 234 | PAGES: 8 | COST: 2/- |

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



# గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి
- విడతల వారీగా అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు
- జనగామలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

2



# అగ్రశ్రేణి పర్యాటక గమ్యంగా తెలంగాణ

- ఐదు లక్షల మందికి ఉపాధి
- తొలి యేడాదిలోనే రూ.22174 కోట్ల పెట్టుబడులు
- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో పర్యాటకరంగానికి కొత్త రూపు
- ఆదివాసీల కోసం రివర్స్ టూరిజం
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

2

# ప్రతి పంచాయతీకి సొంత భవనం

- రూ.1000 కోట్లతో 5,118 భవనాల నిర్మాణం
- 8,000 గ్రామాల్లో మహిళా ప్రాంగణాలు
- తొలిసారిగా గ్రామీణ ప్రాంతాల్లో 'హ్యామ్' రోడ్ల ప్రాజెక్టు
- డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**రంగారెడ్డి, సెప్టెంబర్ 26 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండేలా నిర్మాణ పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జరిగిన ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రంలో సొంత భవనాలు లేని 5,118 గ్రామ పంచాయతీలకు రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేశామని, వీటిలో ఇప్పటికే 3,269 భవనాల నిర్మాణాలు 70 శాతం పూర్తి కావచ్చాయని తెలిపారు. మిగిలిన భవనాలను కూడా ఈ ఏడాది చివరి నాటికి పూర్తిచేసి ప్రతి గ్రామానికి ఒక సొంత భవనాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళలు తమ ఆర్థిక, సామాజిక కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకోవడానికి వీలుగా 8,000 గ్రామాల్లో

మిగతా 3వ పేజీలో..





# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

- విప్రో సర్కిల్‌లో ఆయన విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** తరతరాలకు దార్శనికుడు, దేశం గర్వించదగ్గ జాతిరత్నం డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభివర్ణించారు. దేశ ప్రధానిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు గొప్పవని కొనియాడారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా ఫైనాన్షియల్

మిగతా 2వ పేజీలో..

# నిబద్ధత గల నేత లక్ష్మణ్ బాపూజీ

- సీఎం రేవంత్‌రెడ్డి

2

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు

# బీఆర్ఎస్ కసరత్తు



- ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కేటీఆర్
- ఆరు జిల్లాల నేతలతో వరుస సమావేశాలు

2



# అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా పథకాల అమలు

- 30న సిరిసిల్లకు ముఖ్యమంత్రి: మంత్రి తుమ్మల
- బహిరంగ స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

3

# ఏసీబీకి చిక్కిన మెట్‌పల్లి సీడీపీవో

- అంగన్ వాడీ కేంద్రాల నుంచి లంచం తీసుకుంటుండగా ..

2



# రైతులను రాజులను చేయడమే 'రైతు బడి' లక్ష్యం

- మాజీ మంత్రి హరీశ్ రావు

2





# చేతకాకపోతే పాలన నుంచి తప్పుకోవాలి

- అధ్వానంగా విద్య, వైద్య రంగాలు
- ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నాం: టీఆర్ఎస్ చీఫ్ కవిత

3

# ఈసీ నిష్పాక్షికత తేలాలి

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** ఎన్నికల పోరులో ప్రజాస్వామ్యానికి రిఫరీగా వ్యవహరించాల్సిన భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను కోల్పోవడం రాజ్యాంగ

మిగతా 3వ పేజీలో..

# కాళేశ్వరం పునరుద్ధరణ పనులు నవంబర్‌లో ప్రారంభం

- మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

3

# డీజీపీ కార్యాలయంలో ఐలమ్మ జయంతి



2



# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్ వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దేశ అత్యున్నత పురస్కారంతో ఆయనను సత్కరించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి గుండెకాయలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేశామని చెప్పారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన సరళీకృత విధానాలు తెచ్చారని గుర్తు చేశారు. భారత్‌ను సంక్షోభం నుంచి దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ గట్టెక్కించారని చెప్పారు. నాడు ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ తెలంగాణ బిల్లుపై సంతకం చేశారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు.

# గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

**జనగామ, సెప్టెంబర్ 26 :**

పేదవాడి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదింటి ఆడబిడ్డ కుటుంబంలో చిరునవ్వు చూడాలన్న తపనతో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ కళాశాల గ్రౌండ్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వచ్చే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లు పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి సమానంగా 3,500 ఇళ్లు మంజూరు చేశామని, జనగామ నియోజకవర్గానికి కూడా అదే విధంగా ఇళ్లు ఇచ్చామని తెలిపారు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గానికి మరో 2,000 ఇళ్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుగా పూరిళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిళ్ల కుటుంబాలకు ఈ వేదికపై నుంచే రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అసంపూర్తిగా నిలిచిన ఇందిరమ్మ ఇళ్లు, మొండిగోడలతో ఉన్న ఇళ్లు, స్లాబ్ స్థాయిలో ఆగిపోయిన ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని కూడా రెండో విడతలో అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో సేకరించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు పంపిణీ చేసి తదుపరి విడతల్లో అక్కడ కూడా ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. గతంలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి లబ్దిదారులకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జనగామలో ఇందుకు అవసరమైన రూ.2 కోట్లను వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దసరా నాటికి అర్హులకు ఇళ్లను నివాసయోగ్యంగా అందిస్తామని తెలిపారు. జనగామ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి మొదటి విడతగా రూ.25 కోట్లు వెంటనే మంజూరు చేస్తామని, ఇప్పటికే శంకుస్థాపన చేసిన రూ.5860 కోట్ల అభివృద్ధి పనులు, టెండర్లు పూర్తయిన రూ.19 కోట్ల పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం



వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుందని, ఈ కాలంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమలు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయని, వాటి పరిష్కార దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో అర్హులైన పేదలకే ఇళ్లు అందించాలన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ మున్సిపాలిటీ అత్యంత పురాతనమైనదని, మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ఏడు నెలల క్రితం మున్సిపల్ పరిధిలో రూ.18.90 కోట్ల అభివృద్ధి పనులు మంజూరై టెండర్లు పూర్తయ్యాయని, ఆ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వడ్లకొండశామీర్‌పేట్ బైపాస్ రోడ్డును డబుల్ లైన్ చేయాలని, చీటకోడూరు బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని, గండిరామారం పంపులను మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి మాట్లాడుతూ 2008 నుంచి తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చీటకోడూరు డ్యామ్ పరిసర ప్రాంతాల ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతర తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం 500మంది అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) బెన్షాలోమ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బూష పర్వతాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, డీసీసీ అధ్యక్షురాలు ఎల్.ధన్వంతి నాయక్, వైటీడీఏ సభ్యుడు ఎల్.లక్ష్మీనారాయణ నాయక్, ఆర్డీవో గోపీరాం, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, సంబంధిత అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల నేత లక్ష్మణ్ బాపూజీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు నిబద్ధతతో పోరాడిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమానికి తన ఇల్లు, ఆస్తులను సైతం అంకితం చేసిన బాపూజీ ప్రజా హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని చెప్పారు. బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలు, చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ కసరత్తు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. ఎన్నికలకు ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ఆరు జిల్లాల నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నేతలతో శనివారం విడివిడిగా భేటీ అయ్యారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లను మోసం చేసిందన్న ఆగ్రహం వారిలో తీవ్రంగా ఉన్నదని కేటీఆర్ అన్నారు. చదువుకున్నవారు తమ సమస్యలతోపాటు తమ కుటుంబాలు, అన్నదాతలు, మహిళలు, యువత సహా రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలను గమనిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ద్రోహం చేసిందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదన్నారు. అయితే ఆ వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటుగా మారేలా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మరో రెండు రోజుల్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నేతలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. ఆయా జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయి ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నారు. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఎన్నిక పార్టీ గుర్తుపైనే జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఏసీబీకి చిక్కిన మెట్‌పల్లి సీడీపీవో

**ఇబ్రహీంపట్నం /మెట్పల్లి, సెప్టెంబర్ 26:**

జగిత్యాల జిల్లా మెట్పల్లి సీడీపీఓ దారోజు పద్మ రూ.63 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శుక్రవారం కార్యాలయ ఆవరణ వెలుపల ఫిర్యాదుదారు నుంచి లంచం తీసుకుంటుండగా ఆదిలాబాద్ ఇన్చార్జి ఏసీబీ డీఎస్పీ గౌర్రె మధు ఆధ్వర్యంలోని అధికారులు రెడ్ హ్యాం డెడ్గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.63 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మెట్పల్లి మండల పరిధిలోని 21 అంగన్వాడీ కేంద్రాల నుంచి ఒక్కో కేంద్రానికి నెలకు రూ.1,000 చొప్పున మూడు నెలలకు రూ.3,000గా మొత్తం రూ.63 వేలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. అంగన్వాడీ కేంద్రాల తనిఖీల్లో ప్రతికూల అంశాలు నమోదు చేయకుండా ఉండేందుకు ఈ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. సీడీపీఓను అరెస్టు చేసి కరీంనగర్ లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరు పరచనున్నట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదు దారుడి వివరాలను భద్రతా కారణాలతో గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. అలాగే 9440446106 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు.

# నేషన్ ఫస్ట్.. అదే మా సిద్ధాంతం

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

భారత దేశంలో రాబోయే రాజకీయ పోరు గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలే కాంగ్రెస్ నడిపే కుటుంబ స్వార్థ రాజకీయాలకు, సంఘ్ పరివార్ నమ్ముకున్న నిస్వార్థ దేశ భక్తికి మధ్య ఉన్న తేడా ఏంటో ప్రజలకు స్పష్టం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయం అంటే ఒకే ఒక్క కుటుంబంతో మొదలవుతుంది.. ఆ కుటుంబంతోనే ముగుస్తుందని తెలిపారు. కానీ తమకు ఏ ఒక్క వ్యక్తి లేదా కుటుంబం కంటే దేశ ప్రయోజనాలే ఎల్లప్పుడూ ముఖ్యం అని స్పష్టం చేశారు. దేశంపై ఎమర్జెన్సీ రుద్ది ప్రజల గొంతు నొక్కింది, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ కాదా అని నిలదీశారు. 1984లో దేశ రాజధాని నడిబొడ్డున వేలాది మంది అమాయక సిక్కులను ఊచకోత కోసిన రక్తచరిత్ర కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని గుర్తు చేశారు. 26/11 ముంబైపై పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేసి భారత ప్రజలను పొట్టనబెట్టుకుంటే కనీసం పాకిస్థాన్‌పై ఎదురు దాడి చేసే ధైర్యం లేక చేతులెత్తేసింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ అని ఆయన విమర్శించారు. చివరకు 2013 నాటికి మన దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన ఐదు దేశాల సరసన నిలబెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ పాలనదేనన్నారు. సంఘ్ పరివార్ ఏ ఒక్కరి ఇంటిపేరు మీదో, ఒక కుటుంబం వారసత్వం మీదో నడిచేది కాదని, ఎలాంటి పదవులు, పేర్లు ఆశించకుండా కేవలం సమాజ సేవ, దేశ నిర్మాణం, క్రమశిక్షణ కోసం జీవితాలను త్యాగం చేసిన తరతరాల కార్యకర్తల త్యాగాలతో నిలబడిన వ్యవస్థ అని వివరించారు.

# రైతులను రాజులను చేయడమే 'రైతు బడి' లక్ష్యం

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 26:**

సాధారణ పాఠశాలలు ఉత్తమ పౌరులను తయారు చేస్తే రైతులను నిజంగా రాజులను చేయాలనే మహత్తర లక్ష్యంతో రైతు బడి ఏర్పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తెలిపారు. ఎల్బీ నగర్ చిత్రా లేఅవుట్‌లో శనివారం నిర్వహించిన 'రైతు బడి గ్రూప్' గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ వ్యవసాయ రంగంలో రావాల్సినంత పురోగతి ఇంకా రాలేదన్నారు. ఆ లోటును భర్తీ చేస్తూ రైతులకు అవసరమైన టెక్నాలజీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లాభదాయక పంటలు, మార్కెటింగ్ సమాచారాన్ని అందించే ఒక అనుసంధాన వేదికగా రైతు బడి నిలుస్తుందని ఆకాంక్షించారు. ఇక్కడ రైతులే ఉపాధ్యాయులని, వారి క్షేత్రస్థాయి అనుభవాలే పాఠాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో కుంకుడు కాయల సాగు ద్వారా ఆదాయం పొంది మార్గదర్శకంగా నిలిచిన పద్మనాభం ఉదాహరణను ఆయన గుర్తు చేశారు. పంటల వారీగా, జిల్లాల వారీగా 30 యూట్యూబ్ ఛానళ్లు, ఒక మ్యాగజైన్ ప్రారంభించి 30 లక్షల మంది వీక్షకులకు



చేరువైన నిర్వాహకుడు రాజేంద్ర ప్రయత్నాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా అభినందించారు. సిద్ధిపేట ప్రాంతంలో తాను స్వయంగా చొరవ తీసుకుని వేలాది ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించానని, నాలుగైదేళ్ల వ్యవధిలోనే రైతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కంటే మెరుగైన ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని తెలిపారు. రైతుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన చాలా ఉందన్న హరీశ్ రావు రైతు బడి ద్వారా వారికి సరైన మార్గదర్శకత్వం లభిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంపూర్ణ మద్దతు తెలపడమే కాక ఈ సంస్థ మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# అగ్రశ్రేణి పర్యాటక గమ్యంగా తెలంగాణ

**హైదరాబాద్, సెప్టెంబరు 26:**

తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 ద్వారా రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణకు ఘనమైన చరిత్ర, వారసత్వం, ఆధ్యాత్మికత, సంస్కృతి, ప్రకృతి, వన్యప్రాణులు, వంటకాలు, ఆధునిక పట్టణ ఆకర్షణలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని వారసత్వ సంపద నుంచి యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం వరకు, వరంగల్, యాదాద్రి, భద్రాచలం, నాగార్జునసాగర్, సోమశిల, నల్లమల అడవులు, జలపాతాల వరకు రాష్ట్రంలో విభిన్న పర్యాటక అనుభవాలకు అవకాశాలున్నాయని వివరించారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 ద్వారా తొలుత రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంతో ఇప్పుడు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టడం, 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకలో తెలంగాణను అగ్రశ్రేణి రాష్ట్రాల్లో నిలపడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. టూరిజం పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రాష్ట్రానికి రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 ప్రధాన ఇతివృత్తమైన 'డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి పునఃరూపకల్పన' తెలంగాణకు ఎంతో సముచితమని మంత్రి అన్నారు. తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌ను పునఃరూపకల్పన చేసి ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు ఆధునిక, సమగ్ర డిజిటల్ వేదికగా ఇది అందుబాటులో ఉంటుందని చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రధాన పర్యాటక ఆకర్షణలను సందర్శించేందుకు వీలుగా హాప్-ఆన్, హాప్-ఆఫ్ పర్యాటక సేవలను కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగంగా 'రివర్స్ టూరిజం - ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' కు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. నగరవాసులు పల్లెలు, ప్రకృతి ప్రాంతాలకు వెళ్లడం మాత్రమే కాక అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని ప్రత్యక్షంగా చూసేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. పర్యాటక రంగంలో యువత, మహిళలు, కళాకారులు, గైడ్లు, ఆతిథ్య రంగ సిబ్బంది, రవాణా నిర్వాహకులు, స్థానిక పారిశ్రామికవేత్తలకు అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. గ్రామీణ, పర్యావరణ, సమాజ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా స్థానిక సమాజాలు అభివృద్ధిలో భాగస్వాములై, దాని ప్రయోజనాలను నేరుగా పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యాటక అభివృద్ధి వారసత్వ సంపద, అడవులు, వన్యప్రాణులు, జలవనరులు, సహజ పర్యావరణ పరిరక్షణతో సమన్వయంగా సాగాలని అన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న పర్యాటక నిపుణులు, పారిశ్రామికవేత్తలు, గైడ్లు, హోటల్ నిర్వాహకులు, టూర్ ఆపరేటర్లు, కళాకారులు, స్థానిక సమాజాలకు మంత్రి అభినందనలు తెలిపారు.



# డీజీపీ కార్యాలయంలో ఐలమ్మ జయంతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను డీజీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది వీరనారి చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోషించిన ధైర్యసాహసపూరిత పాత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐజి అడ్మిన్ జె. అన్యోన్య, స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు, సీఏవోలు, సూపరింటెండెంట్లతోపాటు ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాళేశ్వరం పునరుద్ధరణ పనులు నవంబర్‌లో ప్రారంభం

- **వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి**
- **5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు**
- **జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు**
- **మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభించి 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. మూడు బ్యారేజీల భద్రత పటిష్టంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ ప్రతిపాదనలపై మంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్తగా కట్ ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతోపాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చౌరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్ఏ)తోపాటు ఇతర నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయస్థాయి సాంకేతిక సంస్థల సిఫారసుల ఆధారంగానే ప్రతీ పని జరుగుతుంది అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో, ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న దిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ



కమిటీ ముందు ఉంచనున్నట్లు మంత్రి వెల్లడించారు. కమిటీ నిపుణులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫారసులు చేస్తారని తెలిపారు. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులను అప్పగించేలా మొత్తం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల అమలులో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా సాంకేతికంగా పటిష్టమైన, దీర్ఘ కాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ తెలిపారు. పునరుద్ధరణ పనులు పూర్తయి, జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తాం అని తేల్చిచెప్పారు. ఎన్‌డీఎస్ఏ ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, ప్రతి దశను నిపుణుల పరిశీలనకు లోబడి నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.



# అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా పథకాల అమలు

**సిరిసిల్ల, సెప్టెంబర్ 26 :**

అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు బైపాస్ రోడ్ సమీపంలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బిగితేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. 33 నెలల ప్రజా ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. రైతులు, నేతన్నలు, అన్ని వర్గాల ప్రజలు లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 30న కరీంనగర్ జిల్లాలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్‌ను ప్రారంభించడంతోపాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి భారీ బహిరంగ సభలో పాల్గొంటారని, ఈ సందర్భంగా 33 నెలల ప్రజాపాలనలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని తెలిపారు. అదే సమయంలో సామాజిక న్యాయం, ప్రజాస్వామిక ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా మాట్లాడనున్నారన్నారు. 33 నెలల ప్రజా ప్రభుత్వం సంక్షేమ రంగంలోనే కాకుండా వ్యవసాయం, సాంకేతిక రంగం, మౌలిక వసతులు, సాగునీరు, విద్య, ఉపాధి తదితర అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని, సమీకృత అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రత్యేకంగా సిరిసిల్ల నేత కార్మికుల సమస్యలపై సంబంధిత శాఖ మంత్రి తుమ్మల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో కూడా నేతన్నలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. చలో సిరిసిల్ల ద్వారా ప్రజా పాలన విజయాన్ని చాటుదామని పిలుపునిచ్చారు.

# ఈసీ నిష్పాక్షికత తేలాలి

**మొదటిపేజీ తరువాయి**

వ్యవస్థలకే ప్రమాదకరమని, ఈసీ స్వతంత్రతపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనాన్ని ప్రస్తావిస్తూ కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు-పునరుద్ధరణ, ఓటరు డేటాబేస్ కేంద్రీకరణ వంటి 14 కీలక అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడైందన్నారు. గోవాలో అర్హులైన 97 మంది ఓటర్లను అధికారులు ధ్రువీకరించినప్పటికీ కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ లోపం వల్ల తుది జాబితాలో పేర్లు చేరకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ వైఫల్యమేనని మండిపడ్డారు. సాంకేతికత మనిషి సౌలభ్యం కోసం ఉండాలి కానీ సాంకేతికత నెపంతో పౌరుల ఓటు హక్కును బలి ఇవ్వకూడదు అని ఆయన పేర్కొన్నారు.

**13 కోట్లకు పైగా ఓటర్ల తొలగింపుపై ఆందోళన**

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించడంపై మంత్రి ఉత్తమ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు వేసే రోజుకు ముందే తప్పులను సరిదిద్ది అర్హులకు న్యాయం చేయాలని, ఎన్నికలు పూర్తయ్యాక పేరు చేర్చడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు.

**ఎంపిక కమిటీ మార్పులపై విమర్శలు**

ఈసీ నియామక ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా నిర్ణయాత్మక ఆధిపత్యాన్ని కేంద్రం తన వద్దే ఉంచుకుందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చే వరకు సీఈసీ నియామకాన్ని వాయిదా వేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరినప్పటికీ ప్రభుత్వం తొందరపడి జ్ఞానేశ్ కుమార్‌ను నియమించిందని ఆరోపించారు. కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలతో పాటు ఓటరు జాబితాల నిర్వహణకు ఉపయోగిస్తున్న సాంకేతిక వ్యవస్థ పనితీరుపై ఉన్నత స్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రభుత్వ ఆస్తి కాదని, ఓటు అధికార పార్టీ సొత్తు కాదని పేర్కొన్న మంత్రి, పౌరుల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# చేతకాకపోతే పాలన నుంచి తప్పుకోవాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పాలన చేతకాకపోతే బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అధ్వాన పరిస్థితిపై ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ దవాఖానల్లో పట్టిపీడిస్తున్న సమస్యల కారణంగా రాష్ట్రంలో ఏటా సగటున నాలుగు వేల మంది చిన్నారులు కన్నుమూస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 202021 లో 6 వేలు, 2022 23 లో 4,933, 202425 లో 3,853 మంది పసిపిల్లలు చనిపోయారు.. ఏ జిల్లాలో చూసినా దాదాపు 200 వరకు పిల్లలు చనిపోయిన పరిస్థితి. న్యూయార్క్, డల్లాస్ చేస్తామన్న హైదరాబాద్‌లో గతేడాది 1046 మంది పిల్లలు చనిపోయారు



అని తెలిపారు. వైద్య రంగానికి 10 శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి కనీసం 5 శాతం కూడా వెచ్చించకపోవడం దారుణమన్నారు. గతేడాది కేటాయించిన రూ.13,192 కోట్లలో రూ.9,242 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, 11 ఆరోగ్య పథకాలకు గాను ఏడు పథకాలకు పైసా ఇవ్వలేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీ కోసం రూ.700 కోట్లు కేటాయిస్తే రూ.140 కోట్లే ఖర్చు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ స్కీం పెండింగ్ బకాయిలు రూ.500 కోట్లు ఉంటే పైసా విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్, హైదరాబాద్ నిమ్స్, నిలోఫర్ దవాఖానల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కవిత ఆరోపించారు. నిలోఫర్‌లో 200 శాతం బెడ్ ఆక్యుపెన్సీ ఉంటే నిమ్స్‌లో శస్త్రచికిత్స కోసం ఏడు నెలలు నిరీక్షించాల్సి వస్తోందన్నారు. ఆదిలాబాద్ వెళ్లి రిమ్స్ హాస్పిటల్ పరిస్థితి సమీక్షించాల్సిన హెల్త్ మినిస్టర్ హెలికాప్టర్ ఫ్యూయల్ అయిపోయిందని గొడవపడి వెళ్లిపోయారే తప్ప రోగులకు సరైన వైద్యం అందించాలని ఆదేశాలు ఇవ్వలేదని కవిత మండిపడ్డారు. ఆదిలాబాద్ రిమ్స్ లో ఎక్కడ చూసిన చెత్తాచెదారమే కనిపించిందన్నారు. రాష్ట్ర మంత్రి, ప్రతిపక్ష నాయకులు ఇటీవల రిమ్స్ ను సందర్శించారని, అక్కడే పరిస్థితి ఇలా ఉంటే మిగతా హాస్పిటల్స్ పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్లు ఎందుకు ప్రభుత్వ హాస్పిటల్స్, హాస్టల్స్ విజిట్ చేయడం లేదని ప్రశ్నించారు.

**ఆస్తులపై సవాల్.. సిట్‌లన్నీ డైవర్షన్ డ్రామాలు**

తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపించిన దానికంటే రూపాయి ఎక్కువ ఉన్నట్లు నిరూపిస్తే ఆ ఆస్తిని తిరిగి ఇచ్చేస్తానని కవిత స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ అన్ని చట్టబద్ధ అనుమతులతో నిర్మించుకున్నదని, అందులో ఎలాంటి ఎఫ్‌టీఎల్, కబ్జా భూములు లేవని తేల్చిచెప్పారు. కేసీఆర్, కేటీఆర్ ఫామ్‌హౌస్‌లు, ఫోన్ ట్యాపింగ్‌లపై వేసిన 'సిట్' లు కేవలం కాలయాపనకేనని, ప్రభుత్వం విఫలమైనప్పుడల్లా డైవర్షన్ రాజకీయాల్లో భాగంగానే వీటిని తెరపైకి తెస్తోందని విమర్శించారు.

**ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ**

రాబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు. వేరే పార్టీలో గెలిచిన వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చి పోటీ చేయించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల సభలో నెరేళ్ల బాధితులకు న్యాయం చేసే అంశంపై మాట్లాడాలని డిమాండ్ చేశారు.

# పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు తేవాలి

- **ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు**
- **పీపీపీ విధానంలో మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం:**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**

తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. డిజిటల్ అజెండాఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం2026 వేడుకలు శిల్పారామంలో శనివారం ఘనంగా జరిగాయి. వేడుకలకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన డిజిటల్ అజెండాఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు ప్రాధాన్యతను భట్టి విక్రమార్క వివరిస్తూ ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మన పర్యాటక రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని గ్లోబల్ వేదికపై ఆవిష్కరించే నూతన వెబ్‌సైట్‌ను, అద్భుత చిత్రాలతో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, నగరంలోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని పేర్కొన్నారు. వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు.

**పీపీపీ విధానంలో ప్రాజెక్టులు, బడ్జెట్ పెంపు**

గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతులకు తమ పాలసీలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి పెట్టుబడులను భారీగా ఆకర్షించాలని స్పష్టం చేశారు. వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి కలిసి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈవోలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు టూరిజం కూపన్లు అందించి వారాంతాల్లో ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యాటక శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిసూ రాష్ట్ర పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని ఆకాంక్షించారు.

**నూతన కార్యక్రమాలకు శ్రీకారం**

పునర్ రూపకల్పన(రీడిజైన్) చేసిన తెలంగాణ టూరిజం వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ విధానం, కొత్త టూరిజం ట్రైలర్లు, ఇంటరాక్టివ్ ఏఆర్/వీఆర్ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, తెలంగాణ పర్యాటక ప్రాంతాలపై కాఫీ టేబుల్ బుక్, మై తెలంగాణ, మై స్టోరీ, మై డెస్టినేషన్ అంశంపై వీడియో/పోస్టర్, ఎకో టూరిజంపై వీడియోను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి సమక్షంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయ□) కుదుర్చుకున్నారు. 'ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డిజిటల్ టెక్నాలజీ ది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం', ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం తదితర రంగాల్లో వస్తున్న మార్పులు, అవకాశాలపై ప్యానెల్ చర్చ జరిగింది.

# ప్రతి పంచాయతీకి సొంత భవనం

**మొదటిపేజీ తరువాయి**

రూ.800 కోట్ల అంచనా వ్యయంతో మహిళా సంఘాల భవనాలను నిర్మిస్తున్నామని, ఈ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని మంత్రి చెప్పారు.

**'హ్యామ్' విధానంలో గ్రామీణ రహదారులు**

దేశంలోనే తొలిసారిగా గ్రామీణ రహదారుల నిర్మాణానికి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో నాలుగు జిల్లాల్లో 3,861 కిలోమీటర్ల మేర రహదారుల కోసం రూ.3,382 కోట్లు వెచ్చిస్తున్నామని, అక్టోబర్ నుంచి జూన్ వరకు పనులకు అనువైన సమయం కాబట్టి నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత వ్యవధిలోగా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

**వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళిక**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలన్నారు. సింగూరు రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గినందున ప్రత్యేక అధికారిని నియమించి నిజాంసాగర్ నుంచి నీటిని తరలించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. నీటి నిర్వహణ, లభ్యతపై పర్యవేక్షణకు ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన, ఆదివాసీ, చెంచు పెంట ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**రూ.6,000 కోట్లతో ఉపాధి హామీ – జలసిరి పనులు**

వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, అందుబాటులో ఉన్న రూ.6,000 కోట్ల బడ్జెట్‌ను వినియోగించి గ్రామాల్లో శాశ్వత ఆస్తులు, మౌలిక వసతులు, 'జలసిరి' కింద నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

**బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు**

అభివృద్ధి పనులలో అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి సీతక్క హెచ్చరించారు. అద్భుతమైన పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం గౌరవించి సన్మానిస్తుందని స్పష్టం చేశారు.





# సర్వేలో ఎన్డీయేకు 267 సీట్లు

- 2027 యూపీ అసెంబ్లీ ఎన్నికలపై న్యూస్ లీడర్–మాట్రిజ్ సర్వే
- ఎస్పీ కూటమికి 132 స్థానాలు వస్తాయని అంచనా
- బీఎస్పీకి రెండు, ఇతరులకు మరో రెండు స్థానాలు
- నాలుగు ప్రాంతాల్లోనూ ఎన్డీయే ఆధిక్యం ఉంటుందని సర్వే అంచనా
- ఎన్నికలకు ముందే ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్న ప్రధాన పార్టీలు

**లక్నో, సెప్టెంబర్ 26:**

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా కొన్ని నెలల సమయం ఉండగానే రాజకీయ వేడి పెరుగుతోంది. అధికార ఎన్డీయే, ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీతో పాటు కాంగ్రెస్ ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేశాయి. ఈ నేపథ్యంలో న్యూస్ లీడర్ లైవ్-మాట్రిజ్ నిర్వహించిన తాజా ఒపీనియన్ పోల్ ఆసక్తికర అంచనాలను వెల్లడించింది. మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో ఎన్డీయేకు 267, ఎస్పీ నేతృత్వంలోని కూటమికి 132 స్థానాలు దక్కవచ్చని పేర్కొంది. బీఎస్పీకి రెండు, ఇతరులకు మరో రెండు స్థానాలు రావచ్చని అంచనా వేసింది. ఇవి ప్రస్తుత ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే సర్వే అంచనాలు మాత్రమేనని, ఎన్నికల ఫలితాలుగా పరిగణించరాదని గమనించాలి.

**నాలుగు ప్రాంతాల్లో ఎన్డీయే ఆధిక్యం**

ప్రాంతాలవారీ అంచనాల్లోనూ ఎన్డీయే ముందంజలో ఉంటుందని సర్వే పేర్కొంది. పశ్చిమ యూపీలోని 136 స్థానాల్లో ఎన్డీయేకు 93, ఎస్పీ కూటమికి 43 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. అవధ్ ప్రాంతంలోని 118 స్థానాల్లో ఎన్డీయే 77, ఎస్పీ కూటమి 40, బీఎస్పీ ఒక స్థానం సాధించవచ్చని పేర్కొంది. బుందేల్‌ఖండ్‌లోని 19 స్థానాల్లో ఎన్డీయేకు 17, ఎస్పీ కూటమికి రెండు స్థానాలు దక్కవచ్చని తెలిపింది. పూర్వాంచల్‌లోని 130 స్థానాల్లో ఎన్డీయేకు 80, ఎస్పీ కూటమికి 47, బీఎస్పీకి ఒకటి, ఇతరులకు రెండు స్థానాలు వస్తాయని సర్వే అంచనా వేసింది. దీంతో నాలుగు ప్రాంతాల్లోనూ ఎన్డీయే ఆధిక్యం ఉంటుందని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల వాటాలో ఎన్డీయేకు 44 శాతం, ఎస్పీ కూటమికి 38 శాతం వస్తాయని సర్వే అంచనా వేసింది.

మరోవైపు 2027 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన పార్టీల రాజకీయ కార్యకలాపాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు ముమ్మరం చేయగా, ఎస్పీ కూడా క్షేత్రస్థాయిలో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుపైనా చర్చలు కొనసాగుతున్నాయి. దీంతో ఎన్నికలు సమీపించే కొద్దీ యూపీలో రాజకీయ సమీకరణాలు మరింత కీలకంగా మారనున్నాయి.

## సీఈసీపై విపక్షాల పోరు.. 30న 'ఇండియా' భేటీ

- ఎస్ఐఆర్‌పై ఈసీలోనే భిన్నాభిప్రాయాలున్నాయంటూ ప్రచారం
- జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
- సెప్టెంబర్ 25న దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు
- సెప్టెంబర్ 30న ఢిల్లీలో 'ఇండియా' కూటమి సమావేశం
- ఈసీ, ఓటర్ల జాబితాలు, ఎస్ఐఆర్‌పై ఉమ్మడి కార్యాచరణకు కసరత్తు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఎన్నికల సంఘంలో ఎస్ఐఆర్, ఓటర్ల జాబితాలకు సంబంధించిన కొన్ని నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం వెల్లడించింది. గత పది నెలల్లో 14 సందర్భాల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. ఓటర్ల పేర్ల తొలగింపు, ఫామ్6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు ఇందులో ఉన్నట్లు తెలిపింది.

అయితే ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న వాదనను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. భిన్నాభిప్రాయాలు నిర్ణయ ప్రక్రియలో సహజమేనని, తుది నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని స్పష్టం చేసింది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనంలో పేర్కొన్న అభ్యంతరాల ఉనికిని ఈసీ ఖండించకపోయినా, వాటిని నిర్ణయ ప్రక్రియలో భాగంగా వచ్చిన సూచనలుగా పేర్కొంది.

**సీఈసీ రాజీనామాకు విపక్షాల డిమాండ్**

ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను ప్రతిపక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయి. ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తలు ఆందోళనలకు దిగారు.

ఇదే సమయంలో జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేందుకు పార్లమెంటులో మరో తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇచ్చేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

**30న 'ఇండియా' కూటమి భేటీ**

ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30న ఢిల్లీలో 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు సమావేశం కానున్నాయి. ఎన్నికల సంఘం పనితీరు, ఎస్ఐఆర్ అంశాలపై చర్చించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించే అవకాశముంది. ఇప్పటికే విపక్ష పార్టీల నేతలు ఈ అంశంపై పరస్పరం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

ఎస్ఐఆర్‌పై ఈసీ వివరణలు, ఓటర్ల జాబితాల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఇకపై ఉమ్మడిగా ఎలా ముందుకెళ్లాలన్నదే ఈ సమావేశంలో ప్రధాన చర్చగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు, ఈసీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా తుది నిర్ణయాలు నిబంధనల ప్రకారమే తీసుకున్నామని ఎన్నికల సంఘం చెబుతున్న నేపథ్యంలో, విపక్షాల తదుపరి కార్యాచరణపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది



# ఎస్ఐఆర్ నోటీసులపై ఇంటివద్దే పత్రాల సేకరణ

- వోటర్లకు ఊరట కల్పించేలా ఎన్నికల సంఘం నిర్ణయాలు
- దిల్లీ, మహారాష్ట్రల్లో దరఖాస్తులు, అభ్యంతరాల గడువు పొడిగింపు

**న్యూదిల్లీ, సెప్టెంబర్ 26:**



వోటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నోటీసులు అందుకున్న వోటర్ల నుంచి ఇంటివద్దే పత్రాలను సేకరించాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయించింది. సంబంధిత రికార్డులతో అనుసంధానం కాని (అన్‌మ్యాప్డ్), వివరాల్లో తార్కిక అసంగతతలు ఉన్న కారణంగా నోటీసులు అందుకున్నవారి ఇళ్లకు బూత్‌స్థాయి అధికారులు (బీఎల్ఓలు) వెళ్లనున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు న్యూదిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం పత్రికా ప్రకటనలో తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి సమావేశంలో పాల్గొన్నారు. బీఎల్ఓలు సేకరించిన పత్రాలను 'ఈసీనెట్'లో అప్‌లోడ్ చేస్తారు. వాటి ఆధారంగా ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) నిర్ణయం తీసుకుంటారు. ఈ వోటర్లను విచారణ కోసం ఈఆర్ఓ లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ) కార్యాలయాలకు పిలవాల్సిన అవసరం లేదని సంఘం పేర్కొంది. ఈఆర్ఓ నిర్ణయించే అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే విచారణ నిర్వహించాలని, సాధ్యమైనంతవరకు ఆన్‌లైన్‌లోనే చేపట్టాలని సూచించింది. అవసరమైతే వోటరు తన తరపున విచారణకు హాజరయ్యేందుకు కుటుంబంలోని వయోజన సభ్యుడికి అధికారం ఇవ్వవచ్చని తెలిపింది. ఆన్‌లైన్ విచారణ సదుపాయాలను బలోపేతం చేయాలని ఆదేశించింది. రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించేవారు, కార్మికులు, పేదలు, నిరాశ్రయులకు సహాయపడేందుకు అవసరమైన సంఖ్యలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిబిరాలు కూడా నిర్వహించాలని పేర్కొంది. ఎస్ఐఆర్ కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఎన్నికల సంఘం తన ప్రకటనలో తెలిపింది. ఎస్ఐఆర్ కాలానికి వెలుపల వోటర్ల నమోదు నిబంధనలు-1960 ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగించనున్నట్లు వివరించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధ అధికారాలు, విధులకు అనుగుణంగా ఈసీనెట్ వ్యవస్థలో ప్రవేశ అనుమతులు ఉన్నాయని సంఘం పేర్కొంది. ఈ వ్యవస్థ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నదీ లేనిదీ మరోసారి నిర్ధారించేందుకు సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీ సమీక్ష చేపట్టనుంది. ఐఐటీ లేదా ఐఐఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు సభ్యుడిగా ఉండే ఈ కమిటీ ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పిస్తుంది. గత కొన్ని నెలల్లో రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల సూచనల మేరకు పోర్టల్‌లో పలు మెరుగుదలలు చేసినట్లు సంఘం తెలిపింది. క్షేత్రస్థాయి అధికారులకు మరింత వెసులుబాటు అవసరమైతే అందుకు అనుగుణంగా మార్పులు చేస్తామని పేర్కొంది. ఇకపై ఐటీ మాడ్యూళ్లు, పోర్టళ్లకు సంబంధించిన కొత్త ప్రతిపాదనలను ఎన్నికల సంఘం ఆమోదానికి ముందు అధికారుల కమిటీలో చర్చించాలని నిర్ణయించింది. దిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి విజ్ఞప్తి మేరకు వోటర్ల జాబితాకు సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాల దాఖలు గడువును అక్టోబర్ 30 వరకు పొడిగించింది. నోటీసులు, దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కార గడువును నవంబర్ 30 వరకు పెంచింది. మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అభ్యర్థన మేరకు ఆ రాష్ట్రంలో దరఖాస్తులు, అభ్యంతరాల దాఖలు గడువును అక్టోబర్ 12 వరకు, వాటితోపాటు నోటీసుల పరిష్కార గడువును నవంబర్ 10 వరకు పొడిగించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

# సీఈసీ రాజీనామాకు 48 గంటల డెడ్‌లైన్

- ఎస్ఐఆర్‌పై ఈసీలోనే భిన్నాభిప్రాయాలు.. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనంతో కలకలం
- జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్
- అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త ఆందోళనకు సీజేపీ పిలుపు
- ఎన్నికలను నిలిపివేయాలని, ఎస్ఐఆర్‌ను ఆపాలని డిమాండ్
- ఎన్నికల బహిష్కరణకు విపక్షాలు పిలుపునివ్వాలని అభిజిత్ దీప్కే వ్యాఖ్య

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:**



ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై వివాదం కొనసాగుతున్న వేళ ఈసీలో అంతర్గతంగా వ్యక్తమైన అభ్యంతరాలు చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఫామ్6లో మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పరిశోధనాత్మక కథనం వెల్లడించింది. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండా లేదా తమ ఆమోదం లేకుండా తీసుకున్నారని వారు అభ్యంతరాల్లో పేర్కొన్నట్లు ఆ కథనం తెలిపింది.

**సీఈసీ రాజీనామాకు డెడ్‌లైన్**

ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై విమర్శలు తీవ్రతరం చేశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కూడా జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు 48 గంటల గడువు విధించింది. గడువులోగా రాజీనామా చేయకపోతే అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని ప్రకటించింది. ముంబై నుంచి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు.

సీఈసీ రాజీనామాతో పాటు రాబోయే ఎన్నికలను నిలిపివేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను ఆపాలని దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే అక్టోబర్ 2న దేశవ్యాప్త నిరసన ప్రారంభిస్తామని దీప్కే ప్రకటించినట్లు అల్జజీరా నివేదించింది.

**ఎన్నికల బహిష్కరణపై పిలుపు**

ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. అలాంటి ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎందుకు పోటీ చేస్తున్నాయని ప్రశ్నించారు. ఎన్నికల్లో వరుసగా పాల్గొనడం ద్వారా అవి ఆ ప్రక్రియకు చట్టబద్ధత కల్పిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికలను బహిష్కరించాలని ప్రతిపక్ష పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**బంగ్లాదేశ్‌లో బహిష్కరణల చరిత్ర**

ఎన్నికల బహిష్కరణకు సంబంధించి బంగ్లాదేశ్ పరిణామాలను కూడా రాజకీయ చర్చల్లో ప్రస్తావిస్తున్నారు. 2014లో అక్కడి ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలను బహిష్కరించాయి. 2024 జనవరిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలను బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) కూడా బహిష్కరించింది. ఆ ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ విజయం సాధించింది. అయితే ఆ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగలేదని అంతర్జాతీయ పరిశీలకులు, ప్రభుత్వాలు విమర్శలు చేశాయి.

ఆ తర్వాత 2024 ఆగస్టులో విద్యార్థుల నేతృత్వంలోని ఉద్యమం తీవ్రరూపం దాల్చడంతో షేక్ హసీనా పదవి నుంచి తప్పుకుని భారత్‌కు వెళ్లారు. అనంతరం మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. 2026 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ విజయం సాధించి తారిఖ్ రెహమాన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

**ఈసీ వివరణపై ఆసక్తి**

ఎస్ఐఆర్, ఓటర్ల పేర్ల తొలగింపు, ఫామ్-6లో మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణపై వస్తున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈసీలోని ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన కథనం ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చింది.
అయితే ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రశ్నావళికి ఎన్నికల సంఘం నుంచి, అలాగే సంబంధిత ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నుంచి స్పందన రాలేదని ఆ సంస్థ తన కథనంలో పేర్కొంది. అదే సమయంలో ఈసీలో అభిప్రాయ భేదాలు వ్యక్తమవడం సహజమేనని, తుది నిర్ణయాలు కమిషన్ స్థాయిలో తీసుకున్న తర్వాతే అమలవుతాయని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరణలో పేర్కొన్నట్లు కథనం తెలిపింది

# సీఈసీపై మాజీ సీఎస్ సంచలన ఆరోపణ

- బీజేపీ తరపున పోటీ చేయాలని జ్ఞానేష్ కుమార్ సూచించారన్న జిజి థామ్సన్
- పథనంతిట్ట నుంచి ఎంపీగా పోటీ చేస్తే కేంద్ర మంత్రి కావచ్చని చెప్పారంటూ వెల్లడి
- 2016లో ఢిల్లీ విమాన ప్రయాణంలో ప్రస్తావన వచ్చినట్లు వివరణ
- రాజకీయాల్లోకి రావాలన్న సూచనను తిరస్కరించానన్న మాజీ సీఎస్
- ఎస్ఐఆర్‌పై వివాదం కొనసాగుతున్న వేళ తెరపైకి కొత్త ఆరోపణ

**తిరువనంతపురం, సెప్టెంబర్ 26:**



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌పై కేరళ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిజి థామ్సన్ చేసిన ఆరోపణలు కొత్త వివాదానికి దారితీశాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని జ్ఞానేష్ కుమార్ తనకు సూచించినట్లు థామ్సన్ వెల్లడించారు. 2016లో తాను కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో ఢిల్లీకి విమానంలో కలిసి ప్రయాణిస్తుండగా ఈ ప్రస్తావన వచ్చిందని చెప్పారు. అయితే రాజకీయాల్లోకి రావాలన్న సూచనను అప్పుడే తిరస్కరించినట్లు తెలిపారు.

**పథనంతిట్ట నుంచి పోటీ చేయాలన్నారు**

జ్ఞానేష్ కుమార్ తనకు స్నేహితుడని థామ్సన్ పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత ఏం చేయాలనుకుంటున్నారని ఆయన అడగ్గా, పిల్లల కోసం ఓ ప్రాజెక్టుపై పనిచేయాలని భావిస్తున్నట్లు చెప్పానన్నారు. ఈ సందర్భంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో పథనంతిట్ట నుంచి బీజేపీ తరపున పోటీ చేయాలని జ్ఞానేష్ కుమార్ సూచించినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో గెలిచి ఎంపీ అయితే ఆ తర్వాత కేంద్ర మంత్రి అయ్యే అవకాశం కూడా ఉంటుందని చెప్పినట్లు వివరించారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన తనకు లేదని, ఆ ప్రతిపాదనను వెంటనే తిరస్కరించినట్లు థామ్సన్ తెలిపారు.

**ఎస్ఐఆర్ వివాదం వేళ కొత్త ఆరోపణ**

ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే ప్రతిపక్షాలు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నాయి. ఆయన రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని తనకు జ్ఞానేష్ కుమార్ సూచించారంటూ మాజీ సీఎస్ థామ్సన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో సీఈసీ చుట్టూ మరో వివాదం తెరపైకి వచ్చింది.

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

**తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం: పాగర్తి సుధాకర్**





**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంఘాలు, భారతీయ జనతా పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ సంఘం నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. నిజాం కాలంలో భూస్వాముల దౌర్జన్యాలకు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ వీరోచిత పోరాటం చేసిందని గుర్తు చేశారు. తన సొంత పొలంలో పండించిన వరి పంటను దోచుకోవడానికి వచ్చిన దేశ్‌ముఖ్ గూండాలను కర్రతో ఎదిరించి పంటను కాపాడుకున్న ధీర వనిత ఐలమ్మ అని కొనియాడారు.ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఐలమ్మ త్యాగం నిప్పురవ్వలా పనిచేసిందని, ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ, ఐలమ్మ ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని, ప్రభుత్వం ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది అనంతరం రాజముద్ర పేపర్ రిపోర్టర్ ఎల్లుట్ల సైదులు, సిపిఎం మండల నాయకులు పగిడి కత్తుల నాగేశ్వరరావు సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వర్లు యూత్ కాంగ్రెస్ నాయకులు అంజని ఎమ్మార్పీఎస్ నాయకులు వీరయ్య బిజెపి నాయకులు మన్నె కృష్ణారావు సూర్య పల్లి జ్ఞాన రత్నం మల్ల పోయిన గోవిందరావు బాజా రామకృష్ణ కొండా హర్షవర్ధన్ టిఆర్ఎస్ నాయకులు కాసాని నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సిపిఎం నాయకులు కొత్తూరు వెంకటాచారి బిజెపి నాయకులు ధారావత్ వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు..

# కిమ్స్ కడల్స్ ఆధ్వర్యంలో మిసెస్ మామ్ సీజన్-10

- 10 రోజులు, 7 నగరాల్లో
- ఏపీలో 6 నగరాలు, హైదరాబాద్ లో 4 రోజులు
- ఉచిత రెజువెనేట్ రిట్రీట్
- 85% నార్మల్ డెలివరీలు




**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** గర్భిణీలకు అవగాహన కోసం కిమ్స్ కడల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మిసెస్ మామ్' 10వ సీజన్ ప్రారంభం కానుంది. కొండాపూర్ కిమ్స్ కడల్స్ లో సీజన్-10 పోస్టర్ ను ఫౌండర్ డా. కె. శిల్పి రెడ్డి విడుదల చేశారు. క్రయోవివా సహకారంతో జరిగే ఈ ప్రోగ్రామ్ '10 ఇయర్స్ ఆఫ్ గ్లోయింగ్ మదర్స్.. గ్రోయింగ్ ఫ్యామిలీస్' థీమ్ తో అక్టోబర్ 4 నుండి డిసెంబర్ 6 వరకు జరుగుతుంది. హైదరాబాద్ తో పాటు కర్నూలు, విజయవాడ, నెల్లూరు, విశాఖపట్నం, రాజమండ్రి, అనంతపురంలో ఈ ప్రోగ్రామ్ జరుగుతుందని డా. శిల్పి రెడ్డి తెలిపారు. ప్రతి మహిళకు నార్మల్ డెలివరీయే లక్ష్యమని ఆమె అన్నారు. ఈ ప్రోగ్రామ్ లో గైనకాలజిస్టులు, పీడియాట్రీషియన్స్, న్యూట్రిషనిస్టులు పాల్గొని ప్రెగ్నెన్సీ కేర్, యోగా, స్ట్రెస్ మేనేజ్మెంట్, బ్రెస్ట్ ఫీడింగ్, న్యూబోర్న్ కేర్ పై గైడెన్స్ ఇస్తారు. గత 9 సీజన్లలో పాల్గొన్న వారిలో 85% మందికి నార్మల్ డెలివరీలు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. 10వ యానివర్సరీ సందర్భంగా నవంబర్ 28, 29న కాన్హా శాంతి వనంలో రిజిస్టర్డ్ కపుల్స్ కు ఫ్రీ రెజువెనేట్ రిట్రీట్, డిసెంబర్ 6న గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి కిమ్స్ కడల్స్, క్రయోవివా, కిమ్స్ డెంటల్, న్యూబర్గ్, యోధా డయాగ్నోస్టిక్స్ తో పాటు పలు సంస్థలు సపోర్ట్ ఇస్తున్నాయి.

# అమరవాదిపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

- ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రకటనలు మానుకోవాలి
- కొదుమూరి జగన్నాథం గుప్తా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణపై కొందరు వ్యక్తులు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొదుమూరి జగన్నాథం గుప్తా అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్యవైశ్య మహాసభ బలోపేతానికి ఎనలేని కృషి చేశారు అమరవాది . ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం విడిపోయిన అనంతరం సభ్యత్వాలను పెంచడం, లీగల్‌గా ఎదురైన ఇబ్బందులను పరిష్కరించడం, సంఘాన్ని పటిష్టం చేయడం వంటి అనేక అంశాల్లో అమరవాది లక్ష్మీ నారాయణ కృషి చేశారని తెలిపారు. ఆ సమయంలో ప్రభుత్వ సహకారంతో 5 ఎకరాల స్థలం సాధించడంలో కూడా విజయం సాధించారని పేర్కొన్నారు. సమాజ కార్యక్రమాల కోసం అమరవాది తన సొంత ఖర్చులతో, సొంత నిధులతో తిరుగుతున్నారని, ఎలాంటి అపచర్యలకు పాల్పడలేదని, నిధుల దుర్వినియోగం జరగలేదని స్పష్టం చేశారు. దొంగ లేదా డూప్లికేట్ సభ్యత్వాల పేరుతో నిరాధార ఆరోపణలు చేస్తూ ఆర్యవైశ్య సమాజంలో అపోహలు సృష్టించడం సరికాదని జగన్నాథం గుప్తా అన్నారు. ఆర్యవైశ్య ఆత్మీయ భవనం, తిరుమలలో తెలంగాణ భవనం, చింతల్‌బస్తీలోని భవనం రినోవేషన్ వంటి సమాజ అభివృద్ధి కార్యక్రమాలకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతల సహకారాన్ని పదవులతో ముడిపెట్టడం తగదన్నారు. పదవులను ఎవరూ డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని, సభ్యత్వాల సేకరణపై కూడా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయవద్దని సూచించారు. ముఖ్యంగా, అమరవాది కార్యవర్గంలో గతంలో పనిచేసిన వారు ఇన్ని సంవత్సరాల పాటు ఎందుకు మౌనంగా ఉండి ఇప్పుడు మాత్రమే ఈ ఆరోపణలు చేస్తున్నారో సమాజానికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. చింతల్‌బస్తీలోని భవనాన్ని తెలంగాణకు కేటాయించాలనే అంశంపై అమరవాది లక్ష్మీ నారాయణ పోరాటం చేశారని, ఉప్పల్ భగాయత్‌లో స్థలం కేటాయింపునకు సంబంధించి అప్పటి ప్రభుత్వ హయాంలో జీవో జారీ అయిందని తెలిపారు. సమాజ అభివృద్ధికి సంబంధించిన నిర్మాణ కార్యక్రమాలు ముందుకు సాగుతున్న సమయంలో రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు చేయడం వల్ల సమాజానికే నష్టం జరుగుతుందని అన్నారు. కోర్టు ప్రక్రియకు అనుగుణంగా ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడినప్పుడు ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి లేదా ఇతర ప్రముఖులు హాజరైన సమాజ కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో విమర్శించడం కంటే, వాటి ద్వారా ఆర్యవైశ్య సమాజానికి కలిగే ప్రయోజనాలను చూడాలని సూచించారు. ఆర్యవైశ్యులు ఎవరు ఏం చెప్పినా నమ్మే పరిస్థితిలో లేరని, ప్రతి విషయాన్ని ఆలోచించి, పరిశీలించి నిర్ణయం తీసుకునే సమాజం ఆర్యవైశ్య సమాజమని కొదుమూరి జగన్నాథం గుప్తా అన్నారు. 12 సంవత్సరాలు అధికారంలో ఉండి ఏమీ చేయలేదని చెప్పడం సబబు కాదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సభ్యత్వాల విస్తరణ, న్యాయపరమైన సమస్యల పరిష్కారం, సంఘ పటిష్టతతో పాటు భవిష్యత్ నిర్మాణాలకు పునాది వేసే కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. తిరిగి అధికారంలోకి రావాలనుకునే వారు ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టి ఆర్యవైశ్యుల మనసులు గెలుచుకోవాలని సూచించారు. ఎన్నికలు మళ్లీ వస్తాయని, అప్పుడు తమ పనితీరును ప్రజల ముందు ఉంచి మద్దతు కోరవచ్చని, ఎవరిని ఎన్నుకోవాలో ఆర్యవైశ్య సమాజమే నిర్ణయిస్తుందని అన్నారు.

## కంటి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డి ఎం హెచ్ ఓ సుధాకర్ లాల్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** శనివారం వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. సుధాకర్ లాల్ బొంరాస్ పేట మండలంలోని బోట్లవానికుంట తాండలో ఉన్న ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిలకు నిర్వహిస్తున్న కంటి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ కంటిచూపు సమస్యలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, మంచి పోషకాహారం తీసుకోవలసిన ఆవశ్యకత గురించి విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలోని కిచెన్ ను సందర్శించి అక్కడి పరిశుభ్రతను పరిశీలించి, కిచెన్ లో వంట వారితో మాట్లాడుతూ వండిన ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించేంతవరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, వ్యక్తిగత పరిశుభ్రత, కిచెన్ పరిశుభ్రత గురించి, ఆహార పదార్థాల నిల్వ గురించి తగు సూచనలు చేయడం జరిగినది. పాఠశాలలో నిర్వహించిన కంటి స్క్రీనింగ్ కార్యక్రమంలో 350 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి, 36 మంది విద్యార్థులకు కంటి చూపు లోపాలున్నట్లు నిర్ధారించి కళ్లద్దాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని, ఇద్దరి విద్యార్థినిలకు మెల్ల కన్ను సమస్య ఉన్నట్లు నిర్ధారించి వారిని తదుపరి పరీక్షల కొరకు ఉన్నత స్థాయి ఆసుపత్రికి పంపించి అవసరమైతే శస్త్ర చికిత్స ద్వారా సరిచేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ కుమార్, ఆర్ బి ఎస్ కే వైద్య బృందం పాల్గొన్నారు.

## గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి

**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండల కేంద్రంలో "పోషణ మాసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకూర్ సర్పంచ్ శ్రీమతి బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు ప్రతిరోజూ ఆకుకూరలు, గుడ్లు, పాలు, క్యారెట్‌తో పాటు అన్ని రకాల కూరగాయలను ఆహారంలో భాగంగా తీసుకోవాలని సూచించారు. వీటిలో శరీరానికి అవసరమైన అధిక పోషక పదార్థాలు ఉంటాయని, తల్లులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు సీడీపీఓ వి. నాజీ సూపర్‌వైజర్, CHO, H.V., APO, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.




## వీరనారి చాకలి ఐలమ్మ జయంతివేడుకలు



**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండల కేంద్రంలో..తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంగడి ప్రదేశంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి , పిఎసిహెచ్ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ నరేష్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, బిజెపి జిల్లా నాయకులు బొబ్బల ఇంద్రారెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ పోతా గాని మల్లేశం గౌడ్, రజక సహకార సంఘం అధ్యక్షుడు పైల ప్రశాంత్, రజక సంఘం రాష్ట్ర నాయకులు ఎలిమినేటి బుచ్చయ్య, మాజీ అధ్యక్షులు వెలి మే కన్నె సత్యనారాయణ, ఐలమ్మ విగ్రహ నిర్వహణ కమిటీ చైర్మన్ ఎలిమినేటి నగేష్, సీనియర్ జర్నలిస్ట్ ఎలిమినేటి జహంగీర్, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఐలమ్మ జయంతి సందర్బంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ కేంద్రంలో వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించిన చేవెళ్ళ ఎమ్మెల్యే యాదయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యం, ఆత్మగౌరవం సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని రజక సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ , వైస్ చైర్మన్ శ్వేత పాండు రంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపాలరెడ్డి, మండల, మునిసిపల్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, చంద్రమౌళి, కౌన్సిలర్లు అశోక్ , గణేష్ అఖిల యాదిరెడ్డి, గిరిజా శేకర్, లలిత మోహన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మహమూద్, మొయిన్, నాయకులు బాలకృష్ణ, రఘునందన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రజక సంఘం సభ్యులు వెంకటేష్, శంకర్, పెంటీరాజ్, మల్లేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు శనివారం బీసీ వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం చాకలి ఐలమ్మ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, విద్యా శాఖ అధికారి అబ్దుల్ ఘని, డి పి ఆర్ ఓ చెన్నమ్మ,సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన ఉప్పల్ వాయి గురుకుల విద్యార్థులు




**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పెద్దపోతంగల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల, ఉప్పల్‌వాయి విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.ఈ పోటీల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో ఉప్పల్‌వాయి గురుకుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, రెండు విభాగాల్లోనూ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని విజేతలుగా నిలిచారు.

విద్యార్థుల అద్భుత విజయంపై పాఠశాల ప్రిన్సిపల్ శివరాం, ఉపాధ్యాయులు సంతోష్, పీఈటీ గోపాల్, మహేష్ విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన క్రీడా ఉపాధ్యాయులు, కోచ్‌లు మరియు సహకరించిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనిఆకాంక్షించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్‌పై యూత్ కాంగ్రెస్ కీలక సమావేశం



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల అసెంబ్లీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించిన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియపై శనివారం రోజు సమావేశం నిర్వహించారు.జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు, నాగేందర్ రెడ్డి, డిస్టిక్ ఇన్చార్గ్ రాంరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, కార్యాచరణకు సంబంధించిన నిర్ణయం తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లుగారి కార్తీక్ రెడ్డి, శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, నవాబ్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాంరెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మహేశ్వర్ రెడ్డి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ఎం.డి. జాఫర్, యూత్ కాంగ్రెస్ నాయకులు శివకుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శంకర్ పల్లి మండల ఉపాధ్యక్షులు శశికాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ రామ్ రెడ్డి హాజరయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేలా గ్రామాలు, మండలాల వారీగా అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు. ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియకు సంబంధించి త్వరితగతిన కార్యాచరణ రూపొందించి, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు.

## చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం

**కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేయవల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటనపై కేసు నమోదు చేసి, అతని ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చేవెళ్ల మండల పరిధిలోని దేవరంపల్లి గ్రామానికి చెందినఎర్రవల్లి రవి కుమార్ వయస్సు 28 సంవత్సరాలు. వృత్తి డ్రైవర్. తన కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంతకాలంగా ఒత్తిడిలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం (25.09.2026) ఉదయం సుమారు 09:00 గంటలకు రవి కుమార్ తన భార్యకు తాను గ్రామంలోకి వెళ్లి తిరిగి వస్తానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లాడు. అయితే మధ్యాహ్నం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతకడం ప్రారంభించారు. విచారణలో రవి కుమార్ తన స్నేహితుడు నరేందర్‌తో కలిసి బస్సులో చేవెళ్లకు వచ్చినట్లు, అక్కడి నుండి తన సోదరి అర్చన ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. అనంతరం అక్కడి నుండి కూడా వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతను పనిచేస్తున్న వెల్‌స్పన్ కంపెనీలో కూడా విధులకు హాజరు కాలేదని తెలిసింది. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో శనివారం (26.09.2026) రోజు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పైన కనిపించకుండా పోయిన వ్యక్తి ఎక్కడైనా ఎవరికైనా కనిపించినా లేదా ఆచూకీ తెలిసిన సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వగలరని చేవెళ్ల పోలీసులు కోరారు.

## చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ జయంతి వేడుకలు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో చాకలి ఐలమ్మ నూతన విగ్రహావిష్కరణ తో పాటు జయంతి వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నూతన విగ్రహం ఆవిష్కరించిన మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుద్దాల లింగం పాల్గొన్నారు, వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ భూమి కోసం బుక్తి కోసం పోరాటం చేసిన వీర వనిత, అణగారిన ప్రజల కోసం పోరాటం చేసిన వీరవనిత అన్నారు, ఈ కార్యక్రమంలో స్కూల్ ఎంఈఓ శ్రీనివాస్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ప్రశాంత్ కుమార్, మాజీ సర్పంచ్ గిరెడ్డి మహేందర్ రెడ్డి, మాజీ రైతుబంధు అధ్యక్షులు సిహెచ్ తిరుపతి, వార్డ్ మెంబర్స్ సత్యమ్మ సాయిలు, బండి పోచయ్య, స్వరూప ,గంటల రాజమణి ,టంకరి రాజేందర్, ధార రాకేష్, ఎరుకలి గంగాధర్, రజక సంఘ ప్రతినిధులు సదర్ అధ్యక్షులు చాకలి నరేందర్, సిహెచ్ తిరుపతి, చాకలి నర్సింలు, సాయిలు, ఇస్త్రీ సాయిలు, బాలాశయ్య, లచ్చయ్య ,గ్రామ పెద్దలు విడిసి అధ్యక్షులు కూతురు గంగాధర్, టాంకర్ రవి, మేర రవీందర్, ఎన్ రాజిరెడ్డి, రజక కుల పెద్దలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదర్‌నగర్‌లో యువతి అదృశ్యం

**కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని హైదర్‌నగర్‌లో బినియా ఝాన్సీ (28) అనే యువతి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలం పల్లిపేట గ్రామానికి చెందిన బినియా దివ్య, ఆమె సోదరి ఝాన్సీ, వారి సోదరుడితో కలిసి హైదర్‌నగర్ మిత్ర హిల్స్‌లోని సాయి కృప రెసిడెన్సీ ఫ్లాట్ నంబర్ 103లో అద్దెకు ఉంటున్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఝాన్సీ రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవడంతో జ్ఞాపకశక్తి లోపంతో బాధపడుతూ మందులు వాడుతోంది.శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో దివ్య, ఆమె సోదరుడు పరీక్ష రాయడానికి బయటకు వెళ్లగా, ఝాన్సీ ఒక్కతే ఇంట్లో ఉంది. మధ్యాహ్నం 12:30 గంటలకు వారు తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. ఆమె ఫోన్‌కు కాల్ చేయగా ఫోన్ ఇంట్లోనే మోగింది. అపార్ట్‌మెంట్ సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఉదయం 7:50 గంటలకు ఝాన్సీ చేతిలో ఎలాంటి వస్తువులు లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లినట్లు రికార్డయింది. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో, జ్ఞాపకశక్తి మందగించి ఎటో వెళ్లిపోయి ఉండవచ్చని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అదృశ్యమైన ఝాన్సీ సుమారు 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు, తెల్లని ఛాయ కలిగి ఉండి, నలుపు రంగు టాప్, ఆకుపచ్చ రంగు ప్యాంటు ధరించి ఉంది. ఆమె తెలుగు, ఇంగ్లీష్ మాట్లాడగలదు; కుడి చేతిపై ప్రమాదంలో పడిన కుట్ల గుర్తులు ఉన్నాయి. ఈమె ఆచూకీ తెలిసిన వారు కేపీహెచ్‌బీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## మసాని గూడ హనుమాన్ మందిర్ గణపతి నిమజ్జనోత్సవం...

- పాల్గొన్న గ్రామ సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్
- రూ. 3,11,000/- లకు లడ్డు దక్కించుకున్న ఎమ్ఎఆర్ ఫౌండేషన్ (అభిషేక్ రెడ్డి)





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మాసాని గూడ హనుమాన్ మందిర్ గణపతి నిమజ్జనోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ హనుమాన్ మందిర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ నిమజ్జనోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్ హాజరై, గణేశునికి ప్రత్యేక పూజలు చేసి, నిమజ్జోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**గణపతి లడ్డు వేలం పాట...**

గణపతి నిమజ్జనోత్సవం సందర్భంగా హనుమాన్ మందిర్ గణేష్ ఉత్సవ సమితి లడ్డు వేలంపాట నిర్వహించడం జరిగింది. ఈ లడ్డు వేలం పాటలో గ్రామానికి చెందిన ఎం ఏ ఆర్ ఫౌండేషన్ స్థాపకుడు మందాడ అభిషేక్ రెడ్డి రూ. 3,11,000/- గణపతి లడ్డును దక్కించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ.. హనుమాన్ మందిర్ గణపతి లడ్డును దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా గ్రామస్తులతో కలిసి గణపతి నిమజ్జనోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు.

**నిమజ్జనానికి ఊరేగింపుగా గణనాథుడు...**

నిమజ్జోత్సవ సందర్భంగా మహాగణపతిని పూల పండ్లతో సుందరంగా అలంకరించారు. నిమజ్జనోత్సవాన్ని హనుమాన్ మందిర్ నుండి మొదలుకొని భాజా భజంత్రీల నడుమ ఆటపాటలతో నిమజ్జోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జై బోలో గణేష్ మహారాజ్ కి, గణపతి పప్పా మోరియా అనే నినాదాలతో గ్రామంలోని ప్రతి వీధి మార్మోగింది. గణనాథుని ఊరేగింపు సందర్భంగా గ్రామంలోని ప్రతి వీధిలో మహిళలు టెంకాయాలు కొడుతూ..గణపతికి హారతులు ఇచ్చారు. గణపతి నిమజ్జనోత్సవం సందర్భంగా గ్రామం అంతా పండగ వాతావరణం నెలకొందని చెప్పవచ్చు. గ్రామంలోని చిన్న, పెద్ద, మహిళలు, ప్రతి ఒక్కరూ నిమజ్జనోత్సవ కార్యక్రమంలో ఆనందంగా పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. గ్రామస్తులందరితో సందడిగా సాగిన గణపతి ఊరేగింపు, నిమజ్జనంతో ప్రశాంతంగా ముగిసింది.

**అన్న ప్రసాద కార్యక్రమం...**

నిమజ్జనోత్సవం తర్వాత గ్రామస్తులు అందరూ హనుమాన్ మందిర్ వద్ద ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ గణనాథుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ గణపతి నిమజ్జనోత్సవ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పట్లోళ్ల భూ లక్ష్మమ్మ నారాయణరెడ్డి, వార్డు మెంబర్లు, ఆవిష శ్రీనివాస్, కొత్తపల్లి మహేష్ బాబు, మల్లెపూల శంకరయ్య, గ్రామస్తులు సుదర్శన్ రావు, మందాడ లక్ష్మారెడ్డి, తమ్మలి వెంకటేశం, పాండురంగా రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మందాడ జనార్దన్ రెడ్డి, అవిష చంద్రశేఖర్, మందాడ సురేందర్ రెడ్డి, తమ్మలి ప్రసాద్, మందాడ సంతోష్ రెడ్డి, అజాం, చాకలి మహేందర్, మందాడ స్వరూప్ రెడ్డి, టి రవి, కె శ్రీనివాస్, ఊరడి శ్రీనివాస్, గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందిపై దాడులను ఏమాత్రం ఉపేక్షించేది లేదు

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పోలీసు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం, పోలీసులపై చేయి చేసుకోవడం, విధులకు ఆటంకం కలిగించడం తీవ్రంగా పరిగణించబడుతుంది. ఇలాంటి ఘటనలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. పరిగి పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి అనంతరం తెల్లవారుజామున సుమారు 4:00 గంటల సమయంలో రెండు వర్గాల మధ్య గొడవ జరుగుతుండగా, పరిగి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నర్సింలు గొడవను అదుపు చేసేందుకు మధ్యలోకి వెళ్లారు. ఈ సమయంలో గొడవలో పాల్గొన్న తరుణ్ అనే వ్యక్తి కత్తితో కానిస్టేబుల్ నర్సింలుపై దాడి చేసి కడుపులో గాయపరిచాడు. సంఘటన జరిగిన వెంటనే పరిగి ఎస్ఐ, సీఐ, డీఎస్పీ అధికారులు స్పందించి గాయపడిన కానిస్టేబుల్ నర్సింలును పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి కాంటినెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కానిస్టేబుల్ నర్సింలు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హైదరాబాద్‌కు చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నర్సింలును పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ ఘటనపై పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా దర్యాప్తు వేగవంతం చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

**ఎస్పీ గారి హెచ్చరిక**

పోలీసు సిబ్బంది ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడి చేయడం, బెదిరించడం లేదా విధులకు ఆటంకం కలిగించడం ఎంతమాత్రం సహించేది లేదు. పోలీసులపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. నిందితులపై రౌడీ షీట్ ప్రారంభించడం జరుగుతుంది. కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు చేపడతాం అని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా గొడవలకు పాల్పడటం, ఆయుధాలతో తిరగడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, పోలీసు సిబ్బందిపై దాడి చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు.

## గోమాత మహత్యం'పై ప్రత్యేక సందేశం

- చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనం
- ఆధ్యాత్మిక మిత్ర మండలి అధ్యక్షులు బొమ్మిడి అశోక్



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సూర్యాపేట సేవ ఆధ్యాత్మిక మిత్ర మండలి ఆధ్వర్యంలో అక్టోబర్ ఒకటవ తేదీ సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు సూర్యాపేట రవి మహల్ నందు ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చే గోమాత మహత్యంపై ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమం నిర్వహించ బడుతుందని సూర్యాపేట సేవ ఆధ్యాత్మిక మిత్రమండలి అధ్యక్షులు బొమ్మిడి అశోక్ అన్నారు. ఈ కార్యక్రమం ఖచ్చితంగా సమయానికి ప్రారంభం అవుతుంది ,కాబట్టి పట్టణ ప్రజలు ముందుగానే సభా వేదికకు చేరుకోవాలని తెలిపారు. పైన హాలు నిండిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోను లోపలికి అనుమతించబడదని, హాల్ నిండిన తర్వాత కింద డైనింగ్ హాలు బయట ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ ల ద్వారా కార్యక్రమాన్ని వీక్షించవచ్చని చెప్పారు.చాగంటి కోటేశ్వరరావు ప్రసంగాలను ప్రత్యక్షంగా వీక్షించాలంటే ముందుగానే రావాలని తర్వాత వచ్చి నిర్వాహకులను ఇబ్బంది పెట్టవద్దని వారు తెలిపారు. అత్యద్భుతమైనటువంటి ఆధ్యాత్మిక ప్రసంగము గోమాత మీద మనము కనివిని ఎరగని రీతిలో లో ఈ ప్రసంగం ఉండబోతుంది కాబట్టి సూర్యాపేటలోని ఆధ్యాత్మికవేత్తలు ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని వారు తెలిపారు.తాము అడగగానే రవి మహల్ ను ఉచితంగా అందిస్తున్న కర్నాటి రవికి ,యాడ్ ఏజన్సి ప్రసన్న కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట సేవా ఆధ్యాత్మిక మిత్రమండలి కార్యదర్శి వీరవల్లి విజయశంకర్, కోశాధికారి నూకల శైలేందర్, సభ్యులు కర్నాటి రవి, వాస చంద్రశేఖర్,, గుండా సృజన్,బొమ్మిడి సంతోష్, ఇమ్మడి సందీప్, బేతు కిషోర్,కడుదుల రోహిత్ తూముల ప్రవీణ్, బొడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించిన భీమ్ భరత్

**ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం...**



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** మొయినాబాద్ మున్సిపల్ అజీజ్ నగర్ లో వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి వారికి ఘన నివాళులు అర్పించిన చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యం, ఆత్మగౌరవం సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని రజక సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భీమ్ భరత్ తో పాటు మొయినాబాద్ మాజీ మండల అధ్యక్షులు మానయ్య, కౌన్సిలర్లు అమరేందర్ రెడ్డి, యాదగిరి, శంకరయ్య, మాణిక్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, శ్రీను, సీనియర్ నాయకులు మినజుద్దీన్, నరేందర్ రెడ్డి, రజక సంఘం సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు కబడ్డీ స్వర్ణం



**నాగోయా, సెప్టెంబరు 26 :** ఆసియా క్రీడలు-2026లో భారత మహిళల కబడ్డీ జట్టు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరిగిన తుది పోరులో ఇరాన్‌ను 37-34 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో భారత్ ఈ క్రీడల్లో మూడో స్వర్ణ పత కాన్ని ఖాతాలో వేసుకుంది. అలాగే ఆసియా క్రీడల్లో మహి ళల కబడ్డీలో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం. టోకై సిటిజన్ జిమ్నాజియంలో జరిగిన ఫైనల్ ఆరంభం నుంచే హోరా హోరీగా సాగింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 22-16తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో ఇరాన్ పుంజుకుని 18-15తో పైచేయి సాధించినప్పటికీ.. తొలి అర్ధభాగంలో సాధించిన ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని భారత్ కాపాడుకుంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో 37-34తో విజయం సాధించి స్వర్ణాన్ని నిలబెట్టుకుంది.

### ఐదు ఫైనల్స్.. నాలుగు స్వర్ణాలు

భారత మహిళల కబడ్డీ జట్టు ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు ఐదు సార్లు ఫైనల్‌కు చేరింది. 2010, 2014, 2022తో పాటు తాజాగా 2026లో స్వర్ణ పతకాలు సాధించింది. 2018లో మాత్రం ఇరాన్ చేతిలో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకుంది. తాజా విజయంతో భారత్ తన ఆసియా క్రీడల టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. విజయం అనంతరం భారత క్రీడాకారిణులు మైదానంలో సంబరాలు చేసుకున్నారు. జాతీయ జెండాలతో విక్టరీ ల్యాప్ నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు.

# స్క్వాష్‌లో అనాహత్ సింగ్ సంచలనం

### ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత ప్లేయర్



**నాగోయా, సెప్టెంబరు 26 :** ఆసియా క్రీడలు-2026లో భారత యువ స్క్వాష్ క్రీడాకారిణి అనాహత్ సింగ్ అదరగొట్టింది. మహిళల సింగిల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. సెమీఫైనల్లో జపాన్‌కు చెందిన ఆరో ర్యాంక్ క్రీడాకారిణి సటోమి వటనాబేపై 3-2తో విజయం సాధించింది. 18 ఏళ్ల అనాహత్ సింగ్ సెమీఫైనల్లో ఆరంభంలో తడబడింది. వరుసగా తొలి రెండు సెట్లను కోల్పోయి 0-2తో వెనుకబడింది. అయితే ఆ తర్వాత అసాధారణంగా పుంజుకున్న భారత క్రీడాకారిణి వరుసగా మూడు సెట్లలో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో 9-11, 11-13, 12-10, 11-6, 11-3 స్కోరుతో విజయాన్ని అందుకుంది. సెమీఫైనల్లో విజయంతో అనాహత్ సింగ్ ఆసియా క్రీడల్లో తనకు పతకాన్ని ఖాయం చేసుకుంది. ఇప్పుడు ఫైనల్లోనూ విజయం సాధించి స్వర్ణ పతకం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. తొలి రెండు సెట్ల తర్వాత కూడా ఒత్తిడికి గురికాకుండా పోరాడిన తీరు భారత శిబిరంలో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు భారత జోడీ జోష్నా చిన్నప్ప, వేలవన్ సెంథిల్ కుమార్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. హాంకాంగ్‌కు చెందిన టాంగ్ మింగ్ హాంగ్, లీ కా యి జోడీతో జరిగిన పోరులో భారత జోడీ 1-2 తేడాతో ఓటమి పాలైంది. 11-10, 2-11, 11-10 స్కోరుతో హాంకాంగ్ జోడీ విజయం సాధించడంతో భారత జోడీకి కాంస్య పతకం దక్కింది.

# సిరాజ్ బంతికి గిల్ మోచేతికి గాయం

### తొలి వన్డేకు దూరమవుతాడా?



**తిరువనంతపురం, సెప్టెంబరు 26 :** వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందే భారత జట్టుకు గాయాల ఆందోళన ఎదురైంది. తొలి వన్డే ఆదివారం జరగనుండగా.. శు క్రవారం నాటి సాధనలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మోచేతికి గాయమైంది. పేసర్ మహ్మద్ సిరాజ్ వేసిన బంతి అనూహ్యంగా పైకి ఎగసి గిల్ కుడి మోచేతికి బలంగా తాకింది. దీంతో గిల్ నొప్పితో వెంటనే సాధనను నిలిపివేసి మైదానం వీడాడు.

### దాదాపు 20 నిమిషాల పాటు వైద్యుల పర్యవేక్షణ

బంతి తగిలిన వెంటనే గిల్‌కు జట్టు వైద్య సిబ్బంది చికిత్స అందించారు. దాదాపు 20 నిమిషాల పాటు వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్స కొనసాగింది. ఈ ఘటనతో సిరాజ్ సహా సహచర ఆటగాళ్లు గిల్ పరిస్థితిని తెలుసుకున్నారు. అయితే కొద్దిసేపటి తర్వాత గిల్ మళ్లీ నెట్స్‌కు వచ్చి త్రో-డౌన్స్‌ను ఎదుర్కొన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి.

### తొలి వన్డేకు గిల్ ఆడతాడా?

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్ సెప్టెంబరు 27న తిరువనంతపురంలో ప్రారంభం కానుంది. వన్డే జట్టుకు గిల్‌నే కెప్టెన్‌గా ఎంపిక చేశారు. తాజా గాయం నేపథ్యంలో తొలి మ్యాచ్‌లో అతడి అందుబాటుపై తుది నిర్ణయం వైద్య బృందం అంచనాల తర్వాతే తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి గాయం తీవ్రతపై అధికారికంగా స్పష్టమైన సమాచారం వెలువడలేదు.

### నెట్స్‌లో రోహిత్, కోహ్లీ

మరోవైపు సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా నెట్స్‌లో సుదీర్ఘంగా సాధన చేశారు. రాబోయే వన్డే సిరీస్‌కు ముందు ఇద్దరూ బ్యాటింగ్‌పై దృష్టి పెట్టారు. వెస్టిండీస్ జట్టు సెప్టెంబరు 23న నగరానికి చేరుకున్నప్పటికీ శుక్రవారం వరకు సాధన ప్రారంభించలేదని నివేదికలు పేర్కొన్నాయి.



# క్వార్టర్‌ఫైనల్లో అఫ్గాన్‌తో టీమిండియా ఢీ

**నాగోయా, సెప్టెంబరు 26 :** ఆసియా క్రీడలు-2026 పురుషుల క్రికెట్‌లో టీమిండియా క్వార్టర్‌ఫైనల్ ప్రత్యర్థి ఖరారైంది. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగుతున్న భారత్.. సెప్టెంబరు 28న అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. జపాన్-నేపాల్ గ్రూప్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఈ సమీకరణం ఖరారైంది. శనివారం జపాన్, నేపాల్ మధ్య జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ 15 ఓవర్లలో 4 వికెట్లకు 149 పరుగులు చేసింది. సుందీప్ జోరా, లోకేశ్ బామ్ అర్ధశతకాలతో రాణించారు. అనంతరం జపాన్ ఛేదన ప్రారంభించాల్సిన సమయంలో భారీ వర్షం కురవడంతో ఒక్క బంతి కూడా పడలేదు. దీంతో మ్యాచ్ రద్దయి జపాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. నేపాల్ గ్రూప్-ఎ విజేతగా, అఫ్గానిస్థాన్ రెండో స్థానంలో నిలిచాయి. గ్రూప్ దశ అనంతరం క్వార్టర్‌ఫైనల్ లైనప్ పూర్తిగా ఖరారైంది. సెప్టెంబరు 28న భారత్-అఫ్గానిస్థాన్, పాకిస్థాన్-హాంకాంగ్ జట్లు తలపడనున్నాయి. సెప్టెంబరు 29న నేపాల్-శ్రీలంక, బంగ్లాదేశ్-మలేషియా మధ్య క్వార్టర్‌ఫైనల్స్ జరగనున్నాయి. భారత్-అఫ్గానిస్థాన్ మ్యాచ్ సోమవారం ఉదయం 10.30 గంటలకు భారత కాలమానం ప్రకారం ప్రారంభం కానుంది.

# 2027 ప్రపంచకప్‌దే చివరిది.. కోహ్లీ కీలక ప్రకటన

**తిరువనంతపురం, సెప్టెంబరు 26 :** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన వన్డే కెరీర్‌పై కీలక వ్యాఖ్యలు చేశాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్ కానుందని తెలిపాడు. ఆ టోర్నీలో భారత్‌కు ప్రపంచకప్ అందించి కెరీర్‌ను ఘనంగా ముగించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు జియోస్టార్‌తో మాట్లాడిన కోహ్లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. 50 ఓవర్ల ప్రపంచకప్‌లో ఉండే ఉత్కంఠ, తీవ్రత మరే టోర్నీలోనూ ఉండదని కోహ్లీ చెప్పాడు. ఒకే మ్యాచ్‌లో దాదాపు రెండున్నర టీ20 మ్యాచ్‌లు ఆడినంత శ్రమ ఉంటుందని, విదేశీ గడ్డపై సుమారు పది మ్యాచ్‌ల పాటు ఆ తీవ్రతను కొనసాగించడం శారీరకంగా, మానసికంగా పెద్ద సవాల్ అని వివరించాడు. భారత్ తరఫున తాను ఆడబోయే చివరి ప్రపంచకప్ ఇదేనని, అదే తనకు మరింత ప్రేరణనిస్తోందని కోహ్లీ తెలిపాడు. ప్రపంచకప్ గెలవడమే అంతిమ లక్ష్యమని, అందుకోసం పూర్తి స్థాయిలో శ్రమించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. వన్డే ప్రపంచకప్‌లలో కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటివరకు 37 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో 59.83 సగటుతో 1,795 పరుగులు చేశాడు. ఇందులో ఐదు శతకాలు, 12 అర్ధశతకాలు ఉన్నాయి. మొత్తంగా వన్డేల్లో కోహ్లీ 54 శతకాలతో 14 వేలకుపైగా పరుగులు సాధించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా రాబోయే ప్రపంచకప్‌పై తన దృష్టి ఉందని చెప్పాడు. తాను ఆడుతున్నంత కాలం కొత్త లక్ష్యాలు ఉంటాయని, ప్రస్తుతం తన ముందున్న లక్ష్యం 2027 ప్రపంచకప్ అని పేర్కొన్నాడు. ఐసీసీ టోర్నీల్లో భిన్నమైన ప్రత్యర్థులు, వేదికలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు తగిన విధంగా సన్నద్ధం కావాల్సి ఉంటుందని వివరించాడు. భారత్, వెస్టిండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ సెప్టెంబరు 27 నుంచి తిరువనంతపురంలో ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుంది. ఈ సిరీస్ 2027 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా సాగనుంది.





# రౌండ్-16లోకి పీవీ సింధు

నాగోయా, సెప్టెంబరు 26 : ఆసియా క్రీడల్లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు దూసుకెళ్తోంది. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన చియు పిన్-చియాన్‌పై 21-19, 21-14 తేడాతో విజయం సాధించింది. దీంతో ప్రీక్వార్టర్ ఫైనల్ (రౌండ్-16)లోకి ప్రవేశించింది. తొలి గేమ్‌లో సింధుకు ప్రత్యర్థి నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. విరామ సమయానికి 10-11తో వెనుకబడిన ఆమె.. ఆ తర్వాత పుంజుకుంది. రెండు గేమ్ పాయింట్లను చేజార్చుకున్నప్పటికీ మూడో అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 21-19తో గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. విరామ సమయానికి 11-7తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా 21-14తో గేమ్‌ను ముగించి 2-0తో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. రౌండ్-16లో జపాన్‌కు చెందిన తోమోకా మియాజాకితో సింధు తలపడనుంది. భారత యువ షట్లర్ ఉన్నతి హుడా కూడా రౌండ్-16కు చేరింది. రెండో రౌండ్‌లో మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై 21-14, 20-22, 21-9తో విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి కజకిస్థాన్‌కు చెందిన మఖ్సుత్ తజిబుల్లయేవ్‌పై 21-7, 21-7తో గెలిచాడు. మరోవైపు లక్ష్యసేన్ రెండో రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూపై పోరాడుతున్నాడు.



## 'ది వాన్'తోనూ తమన్నాకు నిరాశేనా?

హైదరాబాద్, సెప్టెంబరు 26 : ముంబయి నుంచి వచ్చి టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన తమన్నా భాటియా.. దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'మిల్కీబ్యూటీ'గా అభిమానుల మన్ననలు అందుకున్న ఆమె.. స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలతో అగ్ర కథానాయికగా కొనసాగారు. అయితే బాలీవుడ్‌లో మాత్రం హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో విజయాలు దక్కడం లేదనే చర్చ తరచూ వినిపిస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన 'ది వాన్'లో తమన్నా కథానాయికగా కనిపించారు. అడవిలోని తమ కుటుంబ భూమికి సంబంధించిన వివాదం నేపథ్యంలో సొంతూరికి వెళ్లే నాస్తికుడైన వ్యక్తి ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ కథ సాగుతుంది. ఇందులో హీరో భార్యగా తమన్నా నటించారు. అయితే కథ మొత్తం హీరో చుట్టూనే తిరగడంతో ఆమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేదనే అభిప్రాయాలు కొందరు విమర్శకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. 'ది వాన్'లో తమన్నా కనిపించే పాటకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలుస్తోంది. అయితే కథానాయికగా ఆమె నటనపై పెద్దగా చర్చ జరగడం లేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. దీంతో ఈ సినిమా కూడా తమన్నా బాలీవుడ్ కెరీర్‌లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయిందనే చర్చ మొదలైంది. బాలీవుడ్‌లో ప్రత్యేక పాటల విషయంలో మాత్రం తమన్నాకు మంచి ఆదరణ లభించింది. 'స్త్రీ 2', 'రైడ్ 2' వంటి చిత్రాల్లో ఆమె చేసిన ప్రత్యేక పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మరోవైపు 'లస్ట్ స్టోరీస్ 2', 'ప్లాన్ ఎ ప్లాన్ బి', 'బబ్లీ బౌన్సర్' వంటి చిత్రాల్లో కథానాయికగా కనిపించినా.. అవి ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. ఇప్పుడు 'ది వాన్'పై వస్తున్న స్పందన నేపథ్యంలో బాలీవుడ్‌లో తమన్నా తదుపరి ప్రాజెక్టులపై ఆసక్తి నెలకొంది.



## ప్రమాదం తర్వాత ఆరో రోజే 'మండాడి' షూటింగ్‌కు మహిమా

హైదరాబాద్, సెప్టెంబరు 26 : తమిళంలో ప్రస్తుతం 'మండాడి' సినిమా పేరు మార్మోగుతోంది. సూరి హీరోగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు నటుడు సుహాస్, సీనియర్ నటుడు సత్యరాజ్ కీలక పాత్రల్లో కనిపించగా.. మహిమా నంబియార్ తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. సెప్టెంబరు 10న విడుదలైన ఈ చిత్రం కొద్ది రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. 'మండాడి' విజయంలో మహిమా నంబియార్ చూపించిన అంకితభావం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సినిమాలోని 'ఉసురే నీదాన్ పుల్లా' పాట చిత్రీకరణకు ముందు ఆమె తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారని దర్శకుడు మతిమారన్ సక్సెస్ మీట్‌లో వెల్లడించారు. ఈ ప్రమాదంలో మహిమా ముఖానికి తీవ్ర గాయాలు కాగా.. 20కి పైగా కుట్లు పడినట్లు ఆయన తెలిపారు. ప్రమాదం తర్వాత మహిమా పరిస్థితిని చూసి తాను కూడా షాక్‌కు గురయ్యానని దర్శకుడు చెప్పుకొచ్చారు. అలాంటి సమయంలో ఆమెను షూటింగ్‌కు రావాలని అడగడం కూడా తనకు ఇబ్బందిగా అనిపించిందన్నారు. అయితే సినిమాలో కీలకమైన పాట చిత్రీకరణ జరగాల్సి ఉండటంతో మహిమా ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ జరిగిన కేవలం ఆరో రోజుకే ఆమె తిరిగి సెట్స్‌లో అడుగుపెట్టారని మతిమారన్ వెల్లడించారు. 'మండాడి'లోని పాత్ర కోసం మహిమా శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఎంతో కష్టపడ్డారని దర్శకుడు ప్రశంసించారు. సినిమాలోని కొన్ని భావోద్వేగ సన్నివేశాలు తనను వ్యక్తిగతంగా కూడా ప్రభావితం చేశాయని మహిమా గతంలో చెప్పినట్లు తెలుస్తోంది. కథ, నటీనటుల ప్రదర్శన, దర్శకుడి తెరకెక్కించిన విధానంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.111.80 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాల లెక్కలు చెబుతున్నాయి.

## 'కల్కి 2' షూటింగ్‌కు రంగం సిద్ధం

హైదరాబాద్, సెప్టెంబరు 26 : పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ.. 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ 'కల్కి 2'పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే నెల నుంచి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ వేగం పుంజుకోనున్నట్లు సమాచారం. కొత్త షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె తదితర కీలక నటీనటులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. తొలి భాగం ముగింపులో ఇచ్చిన భారీ హైప్‌కు కొనసాగింపుగా రెండో భాగంలో కథ మరింత ఆసక్తికరంగా ఉండబోతుందని అభిమానులు భావిస్తున్నారు. 2024లో విడుదలైన 'కల్కి 2898 ఏడీ' ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు నాగ్ అశ్విన్ రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అధునాతన దృశ్య ప్రభావాలు, భారీ నిర్మాణ విలువలతో రూపొందనున్న ఈ చిత్ర షూటింగ్‌ను 2027 ప్రథమార్ధంలో పూర్తి చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తొలి భాగంలో మిగిలిపోయిన ప్రశ్నలకు సమాధానాలతో పాటు మహాభారత కాలానికి సంబంధించిన కీలక ఘట్టాలు, కలియుగం నేపథ్యంలో జరిగే పరిణామాలను 'కల్కి 2'లో మరింత గ్రాండ్‌గా చూపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఈ సీక్వెల్‌పై భారీ ఆసక్తి నెలకొంది.






## 31 ఏళ్లకే విషాదాంతం.. ఆర్తి అగర్వాల్ జీవితం



హైదరాబాద్, సెప్టెంబరు 26 : తెలుగు సినీ పరిశ్రమలో అనతికాలంలోనే అగ్ర కథానాయికగా ఎదిగిన అందాల తార ఆర్తి అగర్వాల్. స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు అందుకుంటూ ఓ వెలుగు వెలిగిన ఆమె జీవితం.. ఆ తర్వాత వ్యక్తిగత సమస్యలు, సినిమాలకు దూరం కావడం, అనారోగ్య పరిస్థితులతో విషాదంగా ముగిసింది. ఆర్తి అగర్వాల్ 14 ఏళ్ల వయసులోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టారు. ముంబయిలో నటనలో శిక్షణ తీసుకున్న ఆమె 2001లో 'పాగల్‌పన్' అనే హిందీ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. అదే ఏడాది వెంకటేశ్ హీరోగా కె. విజయభాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నువ్వు నాకు నచ్చావ్'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆర్తి అగర్వాల్ ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారారు. ఆ తర్వాత 'నువ్వు లేక నేను లేను', 'అల్లరి రాముడు', 'ఇంద్ర' వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఉదయ్ కిరణ్, మహేశ్‌బాబు, బాలకృష్ణ, రవితేజ, నాగార్జున, ప్రభాస్ తదితర అగ్ర హీరోల సరసన వరుస అవకాశాలు అందుకున్నారు. అయితే కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు వార్తలు, పుకార్లు ఆమెను ఇబ్బందులకు గురిచేశాయని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అనంతరం కొంతకాలం సినిమాలకు దూరమయ్యారు. 2007లో ఎన్నారై ఉజ్వల్ నికమ్‌ను వివాహం చేసుకున్న ఆర్తి.. కొంతకాలానికే వైవాహిక జీవితంలో సమస్యలు ఎదుర్కొన్నారని వార్తలు వచ్చాయి. అనంతరం విడాకులు తీసుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. 'అందాల రాముడు', 'గోరింటాకు', 'జెంటిల్‌మెన్' వంటి చిత్రాల్లో నటించారు. అయితే అప్పటికే అవకాశాలు తగ్గడంతో పాటు ఆమె బరువు పెరగడం కూడా కెరీర్‌పై ప్రభావం చూపింది. తిరిగి హీరోయిన్‌గా అవకాశాలు అందుకోవాలనే ప్రయత్నంలో భాగంగా బరువు తగ్గేందుకు ఆర్తి అగర్వాల్ 2015 జూన్ 4న అమెరికాలోని న్యూజెర్సీలో లైపోసక్షన్ చేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఇంటికి వెళ్లిన ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురయ్యారు. 31 ఏళ్ల వయసులోనే ఆమె కన్నుమూయడం తెలుగు సినీ పరిశ్రమను, అభిమానులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఆర్తి అగర్వాల్ జీవితం ఇప్పటికీ అభిమానుల మనసుల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిపోయింది.

## ఇంత భయంకరంగా చూపిస్తాడంటే 'ప్యారడైజ్' చేసేవాడిని కాదు

50ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్‌లో 500లకు పైగా చిత్రాల్లో నటించాను కానీ, సికంజ మాలిక్‌లాంటి భయంకరమైన పాత్ర చేయలేదని అన్నారు మోహన్‌బాబు. (వీశీట్ఘుఅ దీఘఎబ) దర్శకుడు శ్రీకాంత్ తెరపై తనని ఇంత వైలెంట్‌గా చూపిస్తాడని తెలిస్తే ఆ పాత్ర చేసేవాడిని కాదంటూ సరదాగా వ్యాఖ్యానించారు. నాని (చీఘఅఱ) కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు ప్రతినాయ కుడిగా నటించారు. తాజాగా ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చిన నేపథ్యంలో చిత్ర బృందం విలేకరుల సమావేశంలో మాట్లాడింది. ఈ కార్యక్రమానికి హాజరైన విలక్షణ నటుడు మోహన్‌బాబు మాట్లాడారు. "దర్శకుడిపై భారం వేసి, సినిమాను నిర్మించిన వాళ్లలో ఒకరిద్దరినే చూశా. మా గురువుగారు దాసరిపై కూడా ఇలాగే నిర్మాతలు నమ్మకం పెట్టుకునేవారు. ఇప్పుడు శ్రీకాంత్‌పై సుధాకర్ చెరుకూరి అదే నమ్మకం ఉంచారు. కొన్ని కొన్ని విషయాలను మాట్లాడాలని ఉన్నా, ప్రజాస్వామ్యంలో మాట్లాడలేం. విద్యాలయాలు పెట్టిన వాళ్లు మాట్లాడే విషయంలో ఇంకా అప్రమత్తంగా ఉండాలి. నేను ఏమాత్రం తప్పుగా మాట్లాడినా 20వేల మంది విద్యార్థినీ విద్యార్థులకు చెడ్డపేరు వస్తుంది. ఎన్నో విషయాలు చెప్పాలన్న ఆవేదన నాలో ఉంది. ప్రజల్లోకి వెళ్లాలి.. నీతి, న్యాయం, ధర్మం, అవినీతి, అక్రమాల గురించి సినిమాల్లో చెబుతాం. కానీ, ఇక్కడ వాటి గురించి మాట్లాడటానికి పరిమితి ఉంది" "ఒక మంచి కథను రథసారధిలా తీసుకెళ్లే వ్యక్తి దర్శకుడు. శ్రీకాంత్ నా దగ్గరకు వచ్చి, ధైర్యంగా కథ చెప్పిన విధానం నచ్చింది. నా ఇన్నేళ్ల నట జీవితంలో ఇలాంటి భయంకరమైన పాత్ర మొదటిసారి చేశా. ఇంత భయంకరంగా చూపిస్తాడనుకుంటే నేను చేసేవాడిని కాదు. ఒప్పుకొన్న తర్వాత తప్పదు కదా! నేను చేయనంటే హీరో ఏమవుతాడు? నిర్మాత ఏమవుతాడనిపించింది. ఒక డైలాగ్ చెప్పేటప్పుడు ఎంత కోపం చూపించాలో కూడా చెప్పేవాడు. షర్ట్ లేకుండా సీన్స్ చేయమన్నారు. కేవలం మూడు సినిమాల్లో మాత్రమే బేర్ బాడీతో కనిపించా. నా జీవితంలో 10 టేకులు చేయించిన దర్శకుడు శ్రీకాంత్. మా గురువుగారు దాసరి కూడా కొన్నిసార్లు ఇలాగే చేయించేవారు. 'ఎందుకు గురువుగారు' అని అడిగితే, 'నీరు ఎంత తోడితే అంత వస్తుంది. ఏదో ఒక టేక్‌లో నీలోని అసలైన నటుడు బయటకు వస్తాడు' అనేవారు"

### ఇంత భయంకరమైన పాత్ర ఇవ్వొద్దు..

"శ్రీకాంత్ నువ్వు సాధారణ దర్శకుడివి కాదు. నేను మోహన్‌బాబును అనే విషయం పక్కన పెట్టి, సికంజా మాలిక్ అనుకునే సెట్‌లో ఉండేవాడు. నాలో టాలెంట్ ఉందని తెలిసినా, ప్రతి రోజు ఒక కొత్త పాఠం నేర్చుకున్నా. ఒక నటుడిగా అతడి ప్రతిభను చూసి గర్వించాను. భవిష్యత్‌లో మంచి దర్శకుడు అవుతాడు. సినీ పరిశ్రమ అందరిది. ప్రతిభ ఎవరిలో ఉంటే వాళ్లను ముందుకు తీసుకెళ్తుంది. ఒకవేళ మళ్లీ అవకాశమిస్తే ఇంత భయంకరమైన పాత్ర ఇవ్వొద్దు"

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com